

బాలసదనం నుంచి పారిపోయిన బాలికలు

మహబూబాబాద్ క్రైం, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి) : మానుకోట పట్టణంలోని బాలసదనం కేంద్రం నుంచి నలుగురు బాలికలు పారిపోయిన విషయం గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మహబూబాబాద్ టౌన్ సీఐ గట్ల మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. సదనం కేంద్రంలో ఆశ్రమం ఉంటున్న నలుగురు బాలికలు ఈనెల 27న రాత్రి 11 గంటల సమయంలో అటెండర్ జయమ్మను తిట్టి, కొట్టి గేట్ తాళం పగలగొట్టి సెల్ ఫోన్ గుంజుకొని పారిపోయారు. దీంతో బాలసదనం సూపరింటెండెంట్ ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



సాదా బైనామాలకు రైట్ రైట్

- ఐదున్నరేళ్ల రైతుల ఎదురుచూపులకు తెర
- హైకోర్టు తీర్పుతో క్రమబద్ధీకరణకు మార్గం సుగమం
- గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2020లో తెచ్చిన జీవో 112పై హైకోర్టులో కేసు
- పాత చట్టం స్థానంలో కొత్తగా భూ భారతిచట్టం రావటంతో తొలిగిన అడ్డంకులు
- క్షేత్రస్థాయిలో విచారణ అనంతరం అర్హులకు పట్టాదార్ పాస్‌బుక్‌లు
- భూ భారతి సదస్సుల్లో భారీగా దరఖాస్తులు
- ఉమ్మడి జిల్లాలో 1,66,784 దరఖాస్తులకు కలగనున్న మోక్షం

■ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

సాదా బైనామాలకు అడ్డంకులు తొలిగాయి. ఐదున్నరేళ్లుగా ఎదురుచూస్తున్న రైతుల నిరీక్షణకు తెరపడింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2020లో తీసుకువచ్చిన 112జీవో స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి చట్టం తీసుకరావటంతో పాటు ప్రభుత్వం సాదా బైనామాల పరిష్కారంపై విధివిధానాలను హైకోర్టుకు సమర్పించింది. దీంతో హైకోర్టు తన ముందు ఉన్న పిల్‌ను కొట్టివేసింది. ప్రభుత్వం సాదా బైనామాల దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. 2020 నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 1,66,784దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా, కొత్తగా ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సుల్లోనూ భారీగా సైదాబైనామా దరఖాస్తులు వచ్చాయి. మొత్తంగా హైకోర్టు గ్రీన్‌సిగ్నల్‌తో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సాదాబైనామాలకు మోక్షం కలుగుతుందనే ఆనందంలో అన్నదాతలు ఉన్నారు.

కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు

రైతులు ఎదుర్కొంటున్న సమస్యల్లో ప్రధానమైనది సాదాబైనామాలు. దీంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సాదాబైనామాల సమస్య పరిష్కరించేందుకు 2016లో జీవో నెం.153ను తీసుకవచ్చింది. 2014 జూన్ 2వ తేదీకి ముందుగా సాదాబైనామాలతో భూములు కొనుగోలు చేసిన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి చట్టబద్ధత కల్పించాలని నిర్ణయించారు. 12 అక్టోబరు 2020లో కూడా జీవో నెంబరు 112ను జారీ చేసింది. మంత్రివర్గ ఉపసంఘాన్ని వేసిన సాదాబైనామాల ప్రక్రియ ముందుకు సాగలేదు. సాదాబైనామాల సమస్య పరిష్కారం కాకుండానే 29 అక్టోబరు 2020లో జీవో నెంబరు 112ద్వారా కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల చట్టాన్ని తెచ్చింది. అయితే ఈ జీవోను సవాల్ చేస్తూ నిర్మల్‌కు చెందిన షిండే దేవిదాస్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన హైకోర్టు జీవో అమలును నిలిపివేస్తూ 2020 నవంబరు 11న మధ్యంతర స్టే ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం సాదాబైనామాలకు చట్టబద్ధత కల్పిస్తుందనే ఆశతో అప్పటికే ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 1,377 రెవెన్యూ గ్రామాల నుంచి 1,66,784మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. వీటిలో వరంగల్ జిల్లాలో 26,630 పెండింగ్ సాదాబైనామాలు ఉండగా, హనుమకొండ జిల్లాలో 27,057 దరఖాస్తులు, జనగామ జిల్లాలో 10,350 దరఖాస్తులు, మహబూబాబాద్ జిల్లాలో 31,250 దరఖాస్తులు, ములుగు జిల్లాలో 20,150 దరఖాస్తులు, భూపాలపల్లి జిల్లాలో 51,347 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటితో పాటు ఇటీవల నిర్వహించిన భూభారతి

(మిగతా 7లో..)



మానుకోటలో శ్రీమహాలక్ష్మి గణపతి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో గోమయం వినాయక విగ్రహం వద్ద పూజలు చేస్తున్న ట్రస్టు బాధ్యులు

కొలువుదీరిన గణనాథులు

- మానుకోటలో ప్రత్యేక ఆకర్షణగా వెండి విఘ్నేశ్వరుడు
- జిల్లా వ్యాప్తంగా 814 విగ్రహాల ఏర్పాటు
- ప్రత్యేక పూజలు చేసిన నిర్వాహకులు, భక్తులు

8

జిల్లాలో వినాయక నవరాత్రి ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని విఘ్నేశ్వరులు ఊరూరా కొలువుదీరారు. మొత్తం జిల్లా వ్యాప్తంగా చిన్న, పెద్ద కలిపి మొత్తం 814 విగ్రహాలతో గణనాథులను ఏర్పాటు చేశారు. వర్షంలో సైతం వివిధ ఆలయ కమిటీల నిర్వాహకులు, యుజవన సంఘాల బాధ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి, గణపతి మండపాల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. మొత్తంగా గణేషులు భక్తుల నుంచి పూజలు అందుకుంటున్నారు.

అమరుల త్యాగాల ఫలితంగానే ఉచిత విద్యుత్

- సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : బషీర్‌బాగ్ కాల్పుల్లో మృతిచెందిన కమ్యూనిస్టు యోధుల త్యాగాల ఫలితంగానే నేడు ఉచిత విద్యుత్ అమలవుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవనంలో సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభను పట్టణ కార్యదర్శి బానోత్ సీతారాంనాయక్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన సాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ... తెలంగాణ సాయుధ పోరాటాన్ని తలపించేలా జలియన్ వాలాబాగ్ ఉద్యమాన్ని మరిపించేలా బషీర్‌బాగ్‌లో 25 సంవత్సరాల క్రితం ఎర్రజెండా ఆధ్వర్యంలో విద్యుత్ ధరల పెంపుకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో నాడు పోలీసులు కాల్పులు జరపగా ముగ్గురు సీపీఎం నాయకులు అమరులయ్యారని చెప్పారు. అయినప్పటికి కమ్యూనిస్టులు మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగుతూ ఉద్యమించాలని తెలిపారు. నాటి సీఎం చంద్రబాబునాయుడు ప్రభుత్వం అమానుషంగా ముల్ల కంచెలు వేసి గుర్రాలతో తొక్కించి వాటర్ క్యాన్లు ప్రయోగించి లాఠీ చార్జీ చేసి వందలాది మంది పోరాట వీరులను గాయపర్చారని చెప్పారు. విద్యుత్ సంస్కరణలు పేదల జీవితాల్లో అత్యంత ప్రమాదకరంగా మారాయని వివరించారు. ఈ కార్యక్రమంలో గునిగంటి రాజన్న, ఆకుల రాజు, సూర్నపు సోమయ్య, కుంట ఉపేందర్, సమ్మెట రాజమౌళి, రావుల రాజు, శాగంటి భాగ్యమ్మ, కుమ్మరికుంట్ల నాగన్న, చీపిరి యాకయ్య, హేమానాయక్, వెంకన్న, శ్రీనివాస్, నక్క సైదులు, మహేందర్, మల్లయ్య పాల్గొన్నారు.



జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తప్ప, ఎవరూ బయటకు రావొద్దని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. జిల్లాలో భారీ వర్షాలకు సంబంధించి గురువారం జిల్లా కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, అధికారులకు దిశానిర్దేశం చేశారు. వాతావరణ సూచన మేరకు భారీ వర్షం ఉన్నందున అధికారులందరూ క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాన్నారు. ప్రజలు చేపల వేటకు వెళ్లకూడదన్నారు. పట్టణాలు, గ్రామాలలో వర్ష సూచనలపై అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది ప్రజలకు విస్తృత ప్రచారం (టాం.. టాం), సోషల్ మీడియా, స్థానిక వాట్సాప్ గ్రూపుల ద్వారా సమాచారం అందించి అప్రమత్తత చేయాలన్నారు. ఎలాంటి పశుసంపద, ప్రాణనష్టం, ఆస్తినష్టం లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు ప్రతీ రెండుగంటలకు ఒకసారి నివేదిక సమర్పిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరం ఉన్నచోట విపత్తుల నివారణ సిబ్బంది, రెవెన్యూ, పోలీస్, గ్రామపంచాయతీ, మునిసిపల్ సిబ్బంది సేవలను వినియోగించుకోవాలన్నారు.

ప్రజలు బయటకు రావొద్దు : ఎస్పీ

మహబూబాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : భారీ వర్షాలు ఉన్నందున అవసరమైతే తప్ప, ప్రజలు ఇంటి నుంచి బయటకు రావొద్దని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ సూచించారు. వాతావరణ సూచనల మేరకు జిల్లాలో భారీ వర్షం వచ్చే అవకాశం ఉండడంతో అత్యంత అవసరం ఉంటే తప్ప బయటకు వెళ్లకూడదని, ప్రజలు చేపల వేటకు వెళ్లకుండా ఉండాలని చెప్పారు. పట్టణ, గ్రామాల్లో వర్ష సూచనపై పోలీస్ అధికారులు, సిబ్బంది విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఎలాంటి పశుసంపదకు నష్టం, ప్రాణనష్టం, ఆస్తినష్టం జరుగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ రెండు గంటలకోకసారి స్థానిక పరిస్థితులపై ఎస్పీ కార్యాలయంకు పోలీస్‌స్టేషన్‌లో నివేదికలు అందించాలని సూచించారు. ఎప్పటికప్పుడు స్థానిక పోలీసులతో టచ్‌లో ఉండాలని, అత్యవసరమైతే డయల్ 100కు, టోల్ ఫ్రీ నెంబర్ 8712656928ను సంప్రదించాలన్నారు.

ఓటర్ల జాబితా ప్రదర్శన

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 18 మండలాల పరిధిలోని 482 గ్రామపంచాయితీల్లో ఓటర్ల జాబితాను గురువారం ప్రదర్శించారు. గత మూడు రోజుల క్రితం రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలోని 4110 వార్డుల్లో ఓటర్ల జాబితాను ప్రదర్శించారు. ఈ నెల 29న అన్ని రాజకీయ పార్టీలతో జిల్లాస్థాయి సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈనెల 30న ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు చెప్పేందుకు అవకాశం కల్పించారు. ఈనెల 31న జిల్లా పంచాయితీ కార్యాలయం ఎదుట ఓటర్ల జాబితాను ప్రదర్శించనున్నారు. సెప్టెంబరు 2న తుది ఓటరు జాబితాను జిల్లా పంచాయితీ అధికారులు ప్రకటించనున్నారు.



ఉప్పరపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఓటరు జాబితాను ప్రదర్శిస్తున్న అధికారులు

హామీలపై చేతులెత్తేసిన ప్రభుత్వం

- మళ్లీ కేసీఆర్ పాలన కావాలంటున్న ప్రజలు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన వారితో ఎర్రబెల్లి దయాకర్‌రావు

పెద్దవంగర, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : పాలన చేతకాక, ఇచ్చిన హామీలు అమలు చేయలేక మూడున్నరేళ్ల ముందే కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. గురువారం కాన్వాయిగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కాసాని వీరయ్య, బుచ్చయ్య, శ్రీనివాస్, పెద్దబుచ్చయ్య, రాజాలుతో పాటు పలువురు నాయకులు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బీఆర్‌ఎస్ పార్టీ చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన అట్టర్‌ప్లాప్ అయ్యిందని, ఏడాదిన్నర పాలనలో ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నదని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ప్రస్తుతం నడుస్తున్నది ప్రజాపాలన కాదని.. పేద ప్రజలను దోచే పాలన అని తెలిపారు. రాష్ట్రంలోని ప్రజలు బీఆర్‌ఎస్, కేసీఆర్ పాలననే కోరుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు రోడ్లమీద తిరిగే పరిస్థితి లేదని విమర్శించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మళ్లీ గులాబీ జెండానే ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్‌ను మరింత బలోపేతం చేయాడానికి కార్యకర్తలు రెట్టింపు ఉత్సాహంతో పని చేయడంతో పాటు అందురూ భాగస్వాములు కావాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని గడపగడకూ వివరించాలన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు సమన్వయంతో పనిచేయాలని, పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం సమష్టిగా కృషిచేయాలని బీఆర్‌ఎస్ శ్రేణులకు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పాకనాటి సునీల్ రెడ్డి, శ్రీరాంసుధీర్, హరీష్, సత్యనారాయణ, ఆంజనేయులు పాల్గొన్నారు.






నిండు కుండలా ఉన్న రామప్ప సరస్సు


రామప్పకు జలకళ

● 32 అడుగులకు చేరుకున్న నీటిమట్టం

వెంకటాపూర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో మండలంలోని రామప్ప సరస్సుకు ములుగు సమీపంలోని మేడివాగు, లోకంచెరువు, జంగాలపల్లి, బండారుపల్లి చెరువుల నుంచి వరదనీరు చేరింది. దీంతో సరస్సు నీటిమట్టం 32 అడుగులకు చేరుకుందని ఐబీ డీఈ రవీందర్‌రెడ్డి, ఏఈ జయంతి తెలిపారు. రామప్ప సరస్సులోకి అధిక మొత్తంలో నీరు చేరడంతో సరస్సు జలకళను సంతరించుకుంది. సరస్సు నీటి సామర్థ్యం 36 అడుగులు కాగా మరో నాలుగు అడుగుల నీరు చేరితే మత్తడి పడనుందని ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆయకట్టు కింద అధికారికంగా 5వేల ఎకరాలు, అనధికారికంగా మరో 5వేల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. ఇక రామప్ప ఆయకట్టు కింద రెండు పంటలకు ఢోకా లేదని రైతులు పేర్కొంటున్నారు.

భీమునిపాదంలో పర్యాటకుల సందడి

గూడూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగరం శివారు కొమ్ములవంచ అటవీప్రాంతంలోని భీమునిపాదానికి గురువారం పర్యాటకులు భారీగా తరలివచ్చారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు భీమునిపాదంలో 70 ఫీట్ల ఎత్తు నుంచి జాలువారుతున్న వాటర్‌ఫాల్స్‌లో పర్యాటకులు కేరింతలు కొడుతూ ఆనందంగా గడిపారు. అడవి అందాలను వీక్షిస్తూ సరదగా గడిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గూడూరు అటవీశాఖ రేంజ్ అధికారి బి.సురేష్ సిబ్బందిని ఏర్పాటు చేసి పర్యవేక్షించారు.


జలపాతంలో పర్యాటకుల సందడి

టోల్‌గేట్ల సమస్యపై సీపీఎం నాయకుల చర్చలు

● సానుకూలంగా స్పందించిన అటవీశాఖ

● జిల్లా వాహనదారులకు మినహాయింపు

గోవిందరావుపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని పస్రా-ఏటూరునాగారం జాతీయ రహదారిపై చెక్‌పోస్టు ఏర్పాటుచేసి ఫాస్టాగ్ పేరుతో డబ్బులు వసూలు చేయడంపై సీపీఎం నాయకులు గురువారం పస్రా అటవీక్షేత్ర కార్యాలయంలో జిల్లా అటవీశాఖ అధికారులతో చర్చలు జరిపారు. ఈ చర్చలో జిల్లా అటవీశాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, ఎఫ్‌డీవో రమేష్, ఏటూరునాగారం రేంజర్ అబ్దుల్ రహమాన్, సీపీఎం జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ, నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ జిల్లాలో పేద బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రజలు టాటామ్యాజిక్ వంటి వాహనాలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారనిఅన్నారు. పస్రా-ఏటూరునాగారం రహదారిలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడం మూలంగా ఫాస్టాగ్ పేరుతో ఆర్థికంగా నష్టపోతున్నారని, వాటిని ఎత్తివేయాలని కోరారు. దీంతో స్పందించిన డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌జాదవ్ మాట్లాడుతూ 1972 యాక్ట్ ప్రకారం టోల్‌గేట్ల నుంచి ఫాస్టాగ్ పేరుతో డబ్బులు వసూలు చేయడం జరుగుతుందని, ఈ విషయంలో ములుగు జిల్లా వాహనదారులను మినహాయిస్తామని హామీ ఇచ్చారు. వాహనదారులు తమ ఆర్సీ, ఆధార్‌కార్డు, ఇతర పత్రాలు సబ్మిట్ చేయాలన్నారు. అదేవిధంగా జిల్లా వాహనాలకు ఫాస్టాగ్ బిల్లు పడకుండా ఉండేందుకు డైవర్షన్ రోడ్డు సౌకర్యం కల్పిస్తామన్నారు. అనంతరం సీపీఎంనాయకులు డీఎఫ్‌వోకు పలు అంశాలపై వినతిపత్రం సమర్పించారు. ఈచర్చలో సీపీఎం నాయకులు ఎమ్డీ.దావూద్, తుమ్మల వెంకటరెడ్డి, పొదిళ్ల చిట్టిబాబు, సోమ మల్లారెడ్డి, గొంది రాజేష్, తదితరులు పాల్గొన్నారు.


డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కళ్లను కాల్చకండి.. పూడ్చకండి..

● నేత్రదానంతో మరొకరికి వెలుగు

● జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి భూక్య రవిరాథోడ్

మహబూబాబాద్ క్రైం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : కళ్లను కాల్చకండి.. పూడ్చకండి.. నేత్రాలను దానం చేస్తే మరొకరికి వెలుగు చూపినంచిన వారవుతారని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి భైక్య రవిరాథోడ్ అన్నారు. 40 జాతీయ నేత్ర పక్షోత్సవాలను ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. గురువారం ఆయన మానుకోటలో మాట్లాడుతూ భారత దేశంలో 12 లక్షల మంది కార్నియా అంధత్వంతో బాధపడతున్నట్లు తెలిపారు. అందులో ఎక్కువ మంది చిన్న పిల్లలు ఉన్నారని గుర్తు చేశారు. కంటి చూపును కోల్పోతే తిరిగి రావడం కష్టమని, కంటికి ఎలాంటి ప్రమాదం జరగకుండా, కంటి వ్యాధులు రాకుండా జాగ్రత్త పడాలన్నారు. ఆగస్టు 25. 1986లో దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ నేత్రాలను దానం చేసి సోనియా గాంధీ ఆదర్శంగా నిలిచారన్నారు. ఒక వ్యక్తి మరణించిన ఆరు గంటల లోపే నేత్రాలను దానం చేస్తే ఉపయోగమన్నారు. ఎయిడ్స్, కుక్క కాటు, కామెర్లు, సిఫిలిసలు, రక్త క్యాన్సర్, కుష్టురోగులు, ఒళ్లు కాలుటవలన మరణించిన వారు నేత్రాలు దానం చేయడానికి అనర్హులన్నారు. కంటికి సంబంధించిన వ్యాధులకు సలహాలు, చికిత్స, ఆపరేషన్లు మహబూబాబాద్ జిల్లా ప్రధాన ఆస్పత్రిలో ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు.

ట్రాక్టర్ పైనుంచి పడి వ్యక్తి మృతి

● మృతుడు జీపీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి

బచ్చన్నపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీకి సంబంధించిన ట్రాక్టర్ పైనుంచి పడి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి మృతి చెందిన ఘటన బసిరెడ్డిపల్లిలో గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ అబ్దుల్ అహ్మద్ కథనం ప్రకారం... బసిరెడ్డిపల్లికి చెందిన జక్కుల అంజయ్య అలియాస్ అంజనేయులు(48) కొన్నేళ్లుగా ఇదే గ్రామపంచాయతీలో ఔట్‌సోర్సింగ్ కింద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రోజులాగే గ్రామంలో చెత్త సేకరించిన చెత్తను డంపింగ్ యార్డ్‌లో పోసి, తిరిగి వస్తున్నక్రమంలో అదుపుపు తప్పి ట్రాక్టర్ కిందపడిపోయి మరణించాడు. అటువైపుగా వెళ్లిన వారు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అంజనేయులుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య మణెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


అంజయ్య (ఫైల్)

నెల్లుట్ల చెరువును పరిశీలించిన కలెక్టర్

లింగాలఘణపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జనగామ పట్టణానికి చెందిన వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు లింగాలఘణపురం మండలం నెల్లుట్ల చెరువును గురువారం కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో నిమజ్జన ఏర్పాట్లను చేపట్టాలని ఆదేశించారు. ఎక్కడ కూడా ఎలాంటి అపశ్రుతులు లేకుండా ప్రశాంతంగా నవరాత్రోత్సవాలను పూర్తి చేసి నిమజ్జనం చేసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్, విద్యుత్, రెవెన్యూ, పంచాయతీరాజ్, మునిసిపల్ శాఖలకు చెందిన అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను వేగవంతంగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పింకేశ్‌కుమార్, డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఆర్డీవో గోపీరామ్, తహసిల్దార్ రవీందర్, ఎంపీడీవో రఘురామకృష్ణ, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.


నెల్లుట్ల చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

చికిత్స పొందుతూ బాలుడి మృతి

● అల్లుడిపై అత్త ఫిర్యాదు.. కేసు నమోదు..

బయ్యారం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు సేవించిన బాలుడు సాత్విక్ (మున్నా)(10) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందగా.. అత్త లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అల్లుడు రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై తిరుపతి పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... మహబూబాబాద్ మండలం సలార్‌తండాకు చెందిన భూక్య లక్ష్మీ-వీరన్న దంపతులకు ముగ్గురు సంతానం. రెండో కూతురు కవితను తొలుత నర్సంపేట మండల అశోక్‌నగర్‌కు చెందిన దేవేందర్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. వీరికి బాబు సాత్విక్ జన్మించాడు. అనంతరం మానసిక పరిస్థితి సరిగ్గా లేక దేవేందర్‌ను విడిచిపెట్టిన కవిత సుమారు 8ఏళ్ల క్రితం బయ్యారం మండలం కోడిపుంజల తండాకు చెందిన ధరవత్ రాజును రెండోవవివాహం చేసుకుంది. వీరికి కూడా పాప భవ్యశ్రీ జన్మించింది. ప్రస్తుతం రాజు-కవిత దంపతులు పిల్లలు సాత్విక్, భవ్యశ్రీలతో కలిసి కోడిపుంజుల తండాలో జీవనం సాగిస్తున్నారు. వివాహం అయినప్పటి నుంచి రాజు కవితను తరుచూ మద్యం సేవిస్తూ వేధిస్తుండేవాడు. చీటికి మాటికి అనుమానిస్తూ కొట్టేవాడు. ఈ క్రమంలోనే ఈ నెల 22న ఉదయం మద్యం సేవించి ఇంటికి వచ్చిన రాజు కవితను అనుమానిస్తూ అసభ్యకరమైన బూతులు తిట్టడమే కాకుండా నువ్వు, నీ కొడుకు సచ్చిపోండి నీ వల్ల నాకు ఉపయోగం లేదు! అంటూ కొట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు. దీంతో మనస్తాపం చెందిన కవిత ఇంట్లోని పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. అది చూసిన కొడుకు సాత్విక్ కూడా పురుగుల మందు సేవించినట్లు ఎస్సై తెలిపారు.


సాత్విక్ (ఫైల్)

కవిత, సాత్విక్ పురుగుల మందు తాగడాన్ని గమనించిన రాజు తండాకు చెందిన కొందరితో కలిసి ఇరువురిని చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలిస్తారు. జిల్లా ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం కుటుం సభ్యులు కవిత, సాత్విక్‌లను మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతున్న బాలుడు సాత్విక్ ఆరోగ్య పరిస్థితి విషమంగా మారడంతో బుధవారం మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న కవిత ఆరోగ్య పరిస్థితి కూడా విషమంగానే ఉన్నట్లు ఎస్సై వెల్లడించారు. కాగా. కూతురు కవిత, మనవడు సాత్విక్‌లు పురుగుల మందు తాగడానికి కారణమైన అల్లుడు రాజుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అత్త లక్ష్మీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బయ్యారం పోలీస్ స్టేషన్‌లో రాజుపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు సాగిస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



చిలుపూర్/లింగాలఘణపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఈనెల 30 నుంచి మహబూబ్‌నగర్ జిల్లా పాలమూరు యూనివర్సిటీలో నిర్వహించే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జనగామ జిల్లా చిలుపూర్ మండలం పల్లగుట్ట ప్రభుత్వ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు, లింగాలఘణపురం మండలం చీటూరు జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఐల రాజు ఎంపికయ్యారు. గత 25న జనగామ పట్టణంలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

అనుమానాస్పదంగా యువతి మృతదేహం

● చిట్యాల మండల వాసిగా గుర్తింపు

● చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు

● హత్యనా.. ఆత్మహత్యనా? అనే కోణంలో విచారణ

కాటారం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారంలోని జాతీయ రహదారి 353(సీ) పక్కన కమలాపూర్ క్రాస్ సమీప మేడిపల్లి అడవిలో గురువారం అనుమానాస్పద స్థితిలో యువతి మృతదేహం లభ్యమైంది. మృతురాలు చిట్యాల మండలం ఒడితల గ్రామానికి చెందిన కప్పల వర్షిణి(22)గా పోలీసులు గుర్తించారు. కుళ్లిన స్థితిలో మృతదేహం ఉండగా, పక్కన ఆధార్ కార్డు, కొన్ని నిమ్మకాయలు, కుంకుమ పడేసి ఉన్నాయి. డీఎస్పీ సూర్యనారాయణ, సీఐ నాగార్జునరావు, ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం... చిట్యాల మండలం ఒడితల గ్రామానికి చెందిన కప్పల వర్షిణి (22) తండ్రి కుమారస్వామి రెండు నెలల క్రితం అనారోగ్యంతో చనిపోయాడు. అప్పటి నుంచి వర్షిణి ఆవేదనతో ఉంది. ఈ నెల 3న తెల్లవారుజామునే వర్షిణి ఇంట్లో నుంచి ఎటో వెళ్లిపోయింది. తల్లి కవిత పలు చోట్ల వెతికినా జాడ దొరకలేకలేదు. దీంతో ఈ నెల 6న చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదైంది. ఈ క్రమంలో కమలాపూర్ క్రాస్ సమీపంలో యువతి మృతదేహంఉన్నట్లు కొందరు ఎస్సై శ్రీనివాస్‌కు గురువారం సమా చారం అందించారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి చూడగా కుళ్లిన స్థితిలో మృతదేహం ఉంది. పక్కన ఆధార్ కార్డు కనిపించడంతో దానిపై ఒడితలకు చెందిన కప్పల వర్షిణి పేరు ఉండటంతో డీఎస్పీ సూర్యనారాయణ ఆదేశాల మేరకు ఎస్సై శ్రీనివాస్ చిట్యాల పోలీసుల సాయంతో మృతురాలి తల్లి కవితకు సమాచారం అందించారు. అక్కడికి చేరిన కవిత.. మృతదేహాన్ని చూసి తన బిడ్డేనని బోరున విలపించింది. ఈ ఘటనపై పోలీసు లు ఇది హత్యనా.. ఆత్మహత్యనా? అనే కోణంలో దర్యాప్తు చేపట్టా రు. 25 రోజుల క్రితం కనిపించకుండా పోయిన యువతి మృతదేహం సుమారు వారం రోజుల క్రితమే చనిపోయినట్లు ఉండటం మిస్టరీగా మారింది. ఎవరైనా హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించడానికే నిమ్మకాయలు, కుంకుమ పడేశారా? అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. కాగా, ఇది హత్యేనని మృతిరాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది.


వర్షిణి మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ సూర్యనారాయణ, సీఐ నాగార్జునరావు, వర్షిణి(ఫైల్)

పర్యావరణ పోటీల్లో దేశంలోనే జనగామ ముందంజ

జనగామ రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : జాతీయ పర్యావరణ పోటీల్లో దేశంలోనే జనగామ ముందంజలో ఉందని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా విద్యార్థులు జాతీయ స్థాయిలో 75,156 రిజిస్ట్రేషన్లతో మొదటి స్థానంలో నిలబెట్టారని తెలిపారు. మన జిల్లా- మన నీరు కార్యక్రమంలో భాగంగా భూగర్భ జలాల మట్టాన్ని పెంపొందించేందుకు ఇంకుడు గుంతలు నిర్మిస్తూ, వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటుతూ విద్యార్థులు, సిబ్బంది, ప్రజలకు పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యం చేస్తున్నామన్నారు.

ఆదివాసీ మహిళపై వ్యక్తి దాడి

కొత్తగూడ(మహబూబాబాద్ జిల్లా), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ మహిళపై వ్యక్తి దాడి చేయగా, ఆమె ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన ఘటన కొత్తగూడలో గురువారం జరిగింది. ఎస్సై రాజ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... కొత్తగూడ మండల కేంద్రంలోని జీఎల్ నగర్‌లో మహ్మద్ పాషా అనే వ్యక్తి అదే గ్రామానికి చెందిన ధనసరి అనసూర్య అనే మహిళ ముందు అనుచితంగా ప్రవర్తించారు. అనసూర్య పాషాను ప్రశ్నించగా దాడి చేశాడు. కాగా, అనసూర్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

సైబర్ మోసగాళ్ల వలలో ఉద్యోగి

● క్రెడిట్ కార్డులోని రూ.8.72 లక్షలు మాయం

కురవి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా కురవి శ్రీవీరభద్రస్వామి దేవాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కట్టా జగన్నాథం సైబర్ నేరస్థుల వలలో చిక్కారు. తన క్రెడిట్ కార్డులోని రూ.8 లక్షల 72వేలను చేజార్చుకున్నారు. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం... జగన్నాథంకు మంగళవారం సాయంత్రం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామంటూ ఫోన్ కాల్ వచ్చింది. సైబర్ నేరస్థులు తాము బ్యాంక్ ఉద్యోగులమని నమ్మించారు. మీ క్రెడిట్ కార్డు ద్వారా ప్రస్తుతం రూ.1.60 లక్షల లిమిట్ మాత్రమే ఉంది. దానిని రూ.6 లక్షలకు పెంచుకోవచ్చునని చెప్పడంతో జగన్నాథం వారి మాటలు నమ్మి కార్డుల వివరాలను సైబర్ నేరస్థులకు వివరించాడు. గంటల వ్యవధిలోనే జగన్నాథం నాలుగు క్రెడిట్ కార్డుల ద్వారా సైబర్ నేరస్థులు రూ.8.72 లక్షలను కాజేశారు. విషయం తెలుసుకున్న జగన్నాథం వెంటనే పోలీసులను ఆశ్రయించాడు. ఎస్సై సతీష్ కేసు నమోదుచేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు ధ్వంసం

● ఇంటికన్నెలో ఇందిరమ్మ ఇంటి కోసం దాచిన డబ్బు దగ్ధం

కేసముద్రం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇంటికన్నె గ్రామంలో బుధవారం పుట్టబంతి వీరన్న-రజిత దంపతుల ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలడంతో ఇల్లు ధ్వంసమైంది. వివరాలిలా ఉన్నాయి. వీరన్న-రజిత దంపతులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా నిర్మాణాన్ని చేపట్టి పక్కనే ఉన్న స్థలంలో తాత్కాలికంగా రేకులు, టార్పాలిన్ కవర్లతో నివాసం ఏర్పాటు చేసుకున్నారు. తమ కుమారుడిని హాస్టల్‌లో చేర్పించేందుకు ఈ దంపతులు వెళ్లగా వీరన్న తల్లి వెంకటమ్మ ఉదయం వంట చేసుకొని కూలీ పనికి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మధ్యాహ్నం 2.30 గంటల ప్రాంతంలో భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. దీంతో గ్రామం అంతా ఉలిక్కిపడింది. ఏం జరిగిందో తెలియక ప్రజలు ఆందోళన చెందారు. పేలుడు తీవ్రతకు ఇంట్లోని సామగ్రి దగ్ధమై చెల్లాచెదురు కాగా నూతన ఇంటి గోడ కూడా బీటలు బారింది. ఇంట్లోని సామగ్రి, ఇంటి నిర్మాణం కోసం తెచ్చిన నగదు, తులం బంగారు గొలుసు అన్ని కలిపి సుమారు రూ.2లక్షల వరకు నష్టపోయినట్లు రోదిస్తూ వెంకటమ్మ తెలిపింది. నిరుపేద కుటుంబం కావడంతో ప్రభుత్వం సహాయం అందించాలని పలువురు కోరారు.


ఇంటికన్నెలో ధ్వంసమైన ఇల్లు

ఆకేరు వాగులో దూకి యువకుడి ఆత్మహత్య

● వీరారంలో విషాదం

మరిపెడ రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని వీరారం గ్రామానికి చెందిన ఓ యువకుడు ఆకేరు వాగులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈఘటన ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం రాకాసి తండా వద్ద మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. మృతుడి తల్లి ఆదమ్మ, సోదరుడు ఉప్పలయ్య, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... చిదుముల మునేష్(27) అనే యువకుడు కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. కొంత కాలంగా మద్యానికి బానిసై మతిస్థిమితం సరిగ్గా లేక ఇబ్బంది పడుతున్నాడు. మంగళవారం రాత్రి ఇంట్లో గొడవ చేయడంతో తల్లి, సోదరుడు కలిసి ఓ ఆటోలో డోర్నకల్ మండలం చిలకొయ్యలపాడులో ఓ భూత వైద్యుడి వద్దకు తీసుకెళ్తున్నారు. ఈ క్రమంలో రాకాసి తండా వద్ద ఆటో దిగబడింది. ఆటోలో నుంచి దిగిన మునేష్ రాకాసి తండా వద్ద ఉన్న ఆకేరు వాగులో దూకాడు. కాగా, రెండు రోజుల తర్వాత గురువారం వాగులో మృతదేహం తేలడంతో స్థానికులు, తండా వాసులు ఒడ్డుకు చేర్చి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కళ్ల ఎదుటే కన్నకొడుకు మృతి చెందడంతో కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. దీంతో వీరారంలో విషాదఛాయలు అలుముకున్నాయి.


మునేష్ (ఫైల్)

అంతర్జాతీయ వేదికపై సత్తా చాటిన పవర్‌లిఫ్టర్ వంశీ

వాజేడు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని సాన్‌జోస్, కోస్టారికాలో జరిగిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ములుగు జిల్లా వాజేడు మండలంలోని ఇప్పగూడెం గ్రామానికి చెందిన మొడెం వంశీ సత్తా చాటాడు. ఈనెల 24 నుంచి సెప్టెంబరు 5 వరకు వరల్డ్ జూనియర్ ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో 66కేజీల విభాగంలో 680 కేజీల బరువును ఎత్తి బంగారు పతకం సాధించాడు. మరో విభాగంలో సైతం గోల్డ్ మెడల్‌ను సాధించి తన ప్రతిభను చాటాడు. వంశీ మొదటి స్థానంలో నిలవగా, రెండో స్థానంలో అమెరికాకు చెందిన బ్రాడిప్రైస్(677.5 కేజీలు), మూడో స్థానంలో ఉక్రెయిన్ క్రీడాకారుడు దిమిత్రిబుటెన్‌కో(677.5 కేజీలు) బరువును ఎత్తారు. అంతర్జాతీయ స్థాయిలో వంశీ సత్తా చాడటంపై కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆర్థిక స్థోమత అంతంత మాత్రమే కావడంతో అమెరికాలో జరిగే పోటీలకు వెళ్లేందుకు వంశీ ఇబ్బందులు పడ్డాడు. దీంతో పలువురు దాతలు ఆయనకు చేయూతను అందించారు. రెండు గోల్డ్‌మెడల్స్ సాధించి దేశానికి, రాష్ట్రానికి పేరు తెచ్చిన వంశీని పలువురు అభినందించారు.


బరువును ఎత్తుతున్న వంశీ


గోల్డ్‌మెడల్ సాధించిన వంశీ

గణేష్ నవరాత్రి వేడుకలతో ఐక్యత

వేయిస్తంభాల ఆలయ అభివృద్ధికి నిధులు



హనుమకొండ పెట్రోల్ పంపు వద్ద..



హనుమాన్ యూత్ జన్మభూమి జంక్షన్‌లోని గణేశుడు



జ్యోతి వెలిగించి నవరాత్రి ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎంపీ కావ్య, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి దంపతులు

- వరంగల్ ఎంపీ కడియం కావ్య
- ఘనంగా మొదలైన వినాయక చవితి వేడుకలు


హనుమకొండ కల్చరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గణేష్ నవరాత్రి వేడుకలు ప్రజల్లో ఐక్యతను పెంపొందింపజేసి ఆధ్యాత్మికతను పెంపొందిస్తాయని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. హనుమకొండలోని చారిత్రక వేయిస్తంభాల ఆలయంలో దేవాదాయ శాఖ పక్షాన వైభవంగా నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి వేడుకలను బుధవారం ఆమె వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి- నీలిమా దంపతులతో కలిసి ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు గట్టు మహేశ్‌బాబు, సాంస్కృతిక కార్యక్రమాలకు దాతగా వ్యవహరిస్తున్న లయన్స్ మల్టీపుల్ నాయకుడు బిర్లా ఓపెన్‌మైండ్స్ డైరెక్టర్ నడిపెల్లి వెంకటేశ్వర్‌రావు, ఈఓ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఆలయంలో గత ఐదేళ్లుగా నిర్వహిస్తున్న వేడుకలు ఈ ప్రాంత ప్రజల్లో భక్తిభావనను పెంపొందింపజేస్తున్నాయని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు.

ఆలయ అభివృద్ధికి నిధులు


వేయిస్తంభాల ఆలయ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ముఖ్యంగా కేంద్ర పురావస్తు, టూరిజం శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను కలిసి రూ. 75 కోట్ల నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేసినట్లు ఎంపీ కావ్య చెప్పారు. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డితో కలిసి కేంద్ర మంత్రిని కలిసిన సందర్భంలో ఆయన సానుకూలంగా స్పందించారని ప్రసాద్ పథకం కింద చేర్చి ఆలయ అభివృద్ధికి కృషి చేయనున్నట్లు హామీ ఇచ్చారని తెలిపారు. కుడా ఆధ్వర్యంలో ఆలయం ముందు భాగాన రోడ్డు వెడల్పు, గార్డెన్ ఆధునీకరణల అంటి కార్యక్రమాలను కూడా చేపడతామన్నారు. తొలిరోజు ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన వాహనసేవలో స్వయంగా ఎంపీ, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. రాత్రి ప్రముఖ పురాణ ప్రవచకులు వంగాల సోమయాజులుచే శమంతకోపాఖ్యానం నిర్వహించారు.

లక్ష్మీగణపతిగా...

రెండవ రోజు నవరాత్రి వేడుకల్లో భాగంగా గురువారం వేయిస్తంభాల ఆలయంలోని ప్రధాన గణపతిని లక్ష్మీ గణపతిగా అలంకరింపజేసి ఐరావత వాహన సేవ నిర్వహించారు. ప్రముఖ బిల్డర్ వేముల సత్యమూర్తి ఆధ్వర్యంలో మ. ధ్యాహ్నం భక్తులకు నిత్యాన్నదానం ప్రారంభింపజేశారు. శివానంద నృత్యమాల నిర్వాహకులు బోంపెల్లి సుధీర్‌రావు బృందంచే గురువారం రాత్రి కళాకారులు అద్భుత శాస్త్రీయ నృత్యాలతో భక్తులను ఓలలాడింపజేశారు. రుద్రేశ్వర సేవా సమితి సభ్యులు గండ్రాతి రాజు, చొల్లేటి కృష్ణమాచారి, పులి రజనీకాంత్ తదితరులు సేవలందించారు.




హనుమకొండ అంబేద్కర్ సెంటర్‌లో..



ఏకశిల యూత్ ఆధ్వర్యంలో బాల గణేసుడిగా కొలువుదీరిన గణనాథుడు



గీసుగొండలోని కంఠమహేశ్వరస్వామి దేవాలయంలో..



కాజీపేట సెయింట్‌పీటర్స్ స్కూల్ సమీపంలో..



రామన్నపేటలో రుద్రాక్షలతో గణనాథుడు



పాపయ్యపేటలో మహావీర్ యూత్ ఆధ్వర్యంలో కొలువుదీరిన గణనాథుడు



కాజీపేట డీజిల్‌కాలనీలో భారీ గణనాథుడు



హనుమకొండ చౌరస్తా పూల దుకాణాల వద్ద..



జేపీఎన్ రోడ్ సిద్ధివిఘ్నేశ్వర ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గాజుపెంకులతో కొలువుదీరిన గణనాథుడు

హాకీ... ఏకాకి..

- దేశవాళి క్రీడగా ప్రసిద్ధిగాంచిన క్రీడపై నీలినీడలు
- ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా నిరాదరణ
- పట్టించుకోని క్రీడా సంఘాలు, అధికారులు




వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా హాకీ క్రీడ ఆదరణకు నోచుకోవడం లేదు. ప్రధానంగా హాకీ క్రీడను ప్రోత్సహించే వారు లేక పోవడం, వర్ధమాన క్రీడాకారులకు తర్ఫీదులు అందించే వారు లేకపోవడంతో ఈ క్రీడ పట్ల క్రీడాకారులు ఆసక్తి చూపడం లేదు. హాకీ క్రీడపై డీఎస్ఏ, అసోసియేషన్లు నిర్లక్ష్యం ప్రదర్శించడంతో క్రీడాకారులకు ఆట అందని ద్రాక్షలాగా మిగిలింది. హాకీ క్రీడను అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టిన ధ్యాన్‌చంద్ జయంతి, జాతీయ క్రీడా దినోత్సవం శుక్రవారం (ఆగస్టు 29) సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని హాకీ క్రీడ స్థితిగతుల పట్ల ప్రత్యేక కథనం...

కోర్టులు లేవు.. కోచ్‌లు కరువు

హనుమకొండ జేఎన్ఎస్‌లో పలు క్రీడలకు మైదానాలు, కోర్టులు ఉన్నప్పటికీ హాకీ క్రీడకు మైదానంతోపాటు కోచ్‌లు సైతం అందుబాటులో లేని కారణంగా ఈ క్రీడ అంతరించిపోయే అవకాశాలు ఉన్నాయని క్రీడాభిమానులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా కేయూ, నిట్ కళాశాలలో సైతం విద్యార్థులు శిక్షణ తీసుకునేందుకు హాకీ కోర్టులు అందుబాటులో లేకపోవడం దయనీయం. అయితే 30 ఏళ్లుగా హనుమకొండ నయీంనగర్‌లోని కుడా మైదానంలో కొందరు సీనియర్ క్రీడాకారులు హాకీ క్లబ్ ఏర్పాటు చేసుకొని వర్ధమాన క్రీడాకారులకు శిక్షణ అందిస్తున్నారు.

ప్రోత్సహించాలి..

జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్) పలు క్రీడలకు కేంద్ర బిందువుగా విరాజిల్లుతోంది. 2005కు ముందు జేఎన్ఎస్‌లో అన్ని క్రీడలకు ఉన్నట్లే హాకీ క్రీడకు కోర్టు ఉండేది. ఇక్కడ శిక్షణ పొందిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు పొందారు. హాకీ జట్టుకు చీఫ్‌కోచ్‌గా ప్రాతినిధ్యం వహించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వందల సంఖ్యలో క్రీడాకారులకు తర్ఫీదు ఇచ్చి రాష్ట్రానికి, దేశానికి పలు స్వర్ణ, రజత, కాంస్య పతకాలు అందించి రిటైర్డు అయిన చెందిన పెరుమాళ్ మధుకరన్ మన ములుగుకు చెందినవాడే కావడం గర్వకారణం. అదే విధంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు గతంలో జేఎన్ఎస్ మైదానంలో హాకీలో శిక్షణ పొందినవారే. గతంలో నిత్యం వందల మంది హాకీ క్రీడాకారులతో కళకళలాడే జేఎన్ఎస్.. నేడు అసోసియేషన్ బాధ్యుల సమన్వయలోపంతో బోసిపోతోంది. ఘన చరిత్ర కలిగిన హాకీ క్రీడను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రోత్సహించి జిల్లాకు పున్వైభవం తీసుకురావాలని పలువురు సీనియర్ క్రీడాకారులు, క్రీడాభిమానులు ఆశిస్తున్నారు.



హాకీ క్రీడకు సహకారం



నగరంలో హాకీ మైదానం ఏర్పాటుకు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సహకారం కోరాం. జిల్లాలో అసోసియేషన్ల సమన్వయ లోపం కారణంగా హాకీ క్రీడను నేర్చుకోవడానికి విద్యార్థులు ముందుకు రావడం లేదు. దీనిపై జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ప్రత్యేక దృష్టి సారించి ఉమ్మడి జిల్లాలో హాకీ క్రీడను ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉంది. ప్రభుత్వాల ప్రోత్సాహంతో పాటు కొన్ని ఐటీ కంపెనీలు ముందుకు వచ్చి క్రీడలను ప్రోత్సహిస్తే మెరికలాంటి క్రీడాకారులను దేశానికి అందించవచ్చు.

- కేఆర్ నాగరాజు, వర్ధన్నపేట ఎమ్మెల్యే

అసోసియేషన్ల సమన్వయ లోపం



అసోసియేషన్ల సమన్వయలోపం వల్ల ఉమ్మడి జిల్లాలో హాకీ క్రీడకు ఆదరణ కరువైంది. గతంలో అంతర్జాతీయస్థాయిలో హాకీ ప్రీమియర్ లీగ్ (హెచ్‌పీఎల్) మ్యాచ్‌లు జరిగేవి. ఏదైనా క్రీడల్లో ప్రతిభ కనబర్చాలంటే పిరమిడ్ లాంటి ప్రణాళిక రూపొందించి క్రీడాకారులకు శిక్షణ అందించాలి. దీంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అదే విధంగా విద్యార్థులను ప్రైమరీ స్థాయి నుంచే క్రీడల వైపు మళ్లించడంతో అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంటారు. ఆ దిశగా తల్లిదండ్రులు, క్రీడా సంఘాలు కృషి చేయాలి.

- పెరుమాళ్ మధుకరన్, ఇండియన్ హాకీ రిటైర్డు చీఫ్ కోచ్

హాకీ కోర్టులు ఏర్పాటు చేయాలి..



గతంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హాకీ క్రీడకు ఆదరణ ఎక్కువ ఉండేది. దీంతో తర్ఫీదు తీసుకునేందుకు క్రీడాకారులతో హామీ క్రీడా మైదానాలు కళకళలాడేవి. కానీ కొన్నేళ్లుగా హాకీ క్రీడను శాట్, డీఎస్ఏలు పట్టించుకోవడం లేదు. హాకీ క్రీడకు కోర్టులు లేకపోవడంతో విద్యార్థులు ఈ ఆటపై ఆసక్తి చూపడం లేదు. ఏళ్లగా హాకీ క్రీడను బతికించుకునేందుకు శ్రమిస్తున్నాం. హనుమకొండ జేఎన్ఎస్‌లో హాకీ కోర్టు ఏర్పాటు చేయడంతో పాటు కోచ్‌ను నియమించేలా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు చొరవచూపాలి.

- ఎం.డి. హుస్సేన్, హాకీ కోచ్, మామునూరు

కోర్టు ఏర్పాటుకు స్థలం లేదు..



హనుమకొండ జేఎన్ఎస్‌లో హాకీ కోర్టు నిర్మించేంత స్థలం లేకపోవడంతో కోర్టు ఏర్పాటుకు అంతరాయం ఏర్పడింది. కొన్నేళ్ల కిందట ఇక్కడ హాకీ కోర్టు ఉండేదని పలువురు అసోసియేషన్ బాధ్యులు, సీనియర్ క్రీడాకారులు నా దృష్టికి తీసుకువచ్చారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్) నగరంలో కోర్టు నిర్మాణం చేయమని ఆదేశాలు ఇస్తే హాకీ కోర్టు నిర్మించే అవకాశం ఉంటుంది.

- జి.అశోక్‌కుమార్, హనుమకొండ డీవైఎస్‌వో

హాకీ స్టిక్స్ కొనేవారు కరువయ్యారు..



గతంలో మా షాపునకు హాకీ స్టిక్స్ కొనుగోలు చేసేందుకు వందల మంది విద్యార్థులు, క్రీడాకారులు బారులు తీరేవారు. కానీ నేడు ఇతర క్రీడా సామగ్రితో పోల్చుకుంటే హాకీ స్టిక్స్ కొనుగోలు చేసేవారు రావడం లేదు. ఒకప్పుడు నెలలో 100 నుంచి 200వరకు హాకీ స్టిక్స్ అమ్మకాలు జరిపేది. నేడు యేడాదికి 500 స్టిక్స్ కూడా అమ్మలేక పోతున్నాం. హనుమకొండ నయీంనగర్‌లోని హాకీ మైదానంలో సాధన చేసే క్రీడకారులు, కొన్ని ప్రైవేటు పాఠశాలకు చెందిన క్రీడకారులు మాత్రమే హాకీ స్టిక్స్ కొనడానికి ఆసక్తి కనబర్చుతున్నారు.

- పులి అనిల్ (స్పోర్ట్స్ వేర్ నిర్వాహకుడు, హనుమకొండ)

సాదా బైనామాలకు రైట్ రైట్..

5వ పేజీ తరువాయి

రెవెన్యూ సదస్సుల్లో కూడా భారీగా సాదాబైనామా దరఖాస్తులు వచ్చాయి.

భూ భారతితో లైన్ క్లియర్

రైతాంగం భూహక్కుల కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న సమస్యలు పరిష్కారం కావటం లేదు. 2020లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు భూ హక్కులను కల్పించే పట్టాదారు పాసు పుస్తకాల చట్టం- 1971ని రద్దు చేసి కొత్తగా పాసుపుస్తకాల చట్టం-2020 ధరణిని తీసుకవచ్చింది. అయితే కొత్త చట్టం ద్వారా రైతు సమస్యలను పరిష్కరించేందుకు గత ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహించిన దాఖాలాలు లేవు. దీంతో సాదాబైనామాలతో పాటు అసైన్డ్ భూముల సమస్యల పరిష్కారానికి ధరణిలో ఎలాంటి మార్గాలను చూపించలేదు. దీంతో పాటు గ్రామ రెవెన్యూ అధికారుల వ్యవస్థను రద్దు చేయటంతో రైతుల కష్టాలు మరింత పెరిగాయి. రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో ఒక్కటి సాదాబైనామా. గతంలో చాలామంది రైతులు తెల్లకాగితాలపై, రెవెన్యూ స్టాంపు పేపర్లపై భూములు క్రయవిక్రయాలు చేశారు. ఇవీ అధికారికం కాకపోవటంతో వీటికి రిజిస్ట్రేషన్లు జరగలేదు. ఫలితంగా బ్యాంకుల్లో వీరికి రుణాలు కూడా అందటం లేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత రైతుల సమస్యల పరిష్కారంపై ఫోకస్ చేసింది. క్షేత్రస్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్, మే, జూన్ నెలల్లో రెవెన్యూ గ్రామ సదస్సులను ప్రభుత్వం నిర్వహించింది. ఈ సదస్సుల్లో అత్యధికంగా సాదాబైనామాలపైనే దరఖాస్తులు వచ్చాయి. గతంలో దరఖాస్తు చేసుకున్న రైతులు మరోసారి భూభారతి సదస్సులో దరఖాస్తులు చేశారు. దీంతో ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించి, సాదాబైనామాలపై మధ్యంతర స్టే ఉత్తర్వులను ఎత్తివేయాలని కోరింది. దీంతో గత ప్రభుత్వం తీసుకవచ్చిన 112జీవో స్థానంలో కొత్తగా భూ భారతి చట్టం తీసుకవచ్చిన అంశాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఎట్టకేలకు కోర్టు విచారణ అనంతరం సాదాబైనామాలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

క్షేత్రస్థాయిలో పరిశీలన తరువాతే..

కుప్పలు, తెప్పలుగా సాదాబైనామాల దరఖాస్తులు వస్తుండటంతో ప్రభుత్వం భూ భారతి చట్టం ప్రకారం పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 12ఏళ్ల పాటు భూమి స్వాధీనంలో ఉండి, ప్రభుత్వం నిర్దేశించినట్టుగా రాతపూర్వకంగా ఒప్పందంఉంటే సాదా బైనామాలు చెల్లుతాయని ప్రభుత్వం ఇటీవల కోర్టుకు విన్నవించింది. దీంతో పాటు గతంలో సాదా బైనామాల కోసం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న 1,66,784 దరఖాస్తుల్లో ఎన్ని అర్హతలను కలిగి ఉన్నాయో కూడా అధికారులు గుర్తించనున్నారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పంచాయతీ కార్యాలయంలో నోటీస్ బోర్డులో వివరాలను అంటించి అభ్యంతరాలను స్వీకరించనున్నారు. అన్నిరకాల పరిశీలన తరువాతే అర్హులను గుర్తించి పట్టాదారు పాస్ పుస్తకాలను అందించేందుకు అధికారయంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

ఆస్తి తగాదాలతో హత్య చేసిన నలుగురికి జీవితఖైదు

వరంగల్ లీగల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఆస్తుల తగాదాలతో వ్యక్తిని హత్య చేసిన కేసులో నేరం రుజువైనందుకు నలుగురికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.5వేలు జరిమాన విధిస్తూ వరంగల్ జిల్లా ప్రధాన సెషన్స్ జడ్జి బీవీ నిర్మాల గీతాంబ గురువారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి.

వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం బంధంపల్లి గ్రామానికి చెందిన మక్కాజి రాజేష్.. తన తల్లి ప్రమీల, తమ్ముడు ప్రవీణ్, అక్క సరితలతో ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఆ గొడవల్లో పలుమార్లు కుటుంబ సభ్యులంతా కలిసి రాజేష్‌పై దాడి చేసి కొట్టారు. దీంతో బతుకుదెరువు కోసం వరంగల్ వచ్చి భార్యతో కలిసి జీవనం కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో 2021 జూలై 6న బంధంపల్లి గ్రామంలోని పొత్తులో ఉన్న భూమి ఇంటి స్థలం విషయంలో పంచాయితీలో తేల్చుకునేందుకు వెళ్లారు. మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో అక్కడ ఇంటి ముందు మక్కాజీ రాజేష్, తన భార్యతో కలిసి ఉండగా వంగపహాడ్ గ్రామానికి చెందిన బొక్క రాజు, తమ్ముడు మక్కాజీ ప్రవీణ్, తల్లి ప్రమీల, అక్క సరితలు వచ్చి ఆస్తిలో వాటా కావాలా..? అంటూ అందరు కలిసి రాజేష్ అతడి భార్య కళ్లలో కారం చల్లారు. ఈలోగా ప్రవీణ్ బండరాళ్లతో రాజేష్ తలపై తీవ్రంగా కొట్టాడు. బీరు సీసాతో సైతం దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. అనంతరం నిందితులందరూ ఒక్కసారిగా దాడి చేసి రాజేష్‌ను కత్తితో పొడవగా తీవ్రగాయాలతో చనిపోయాడు. దీంతో రాజేష్‌ను ఇతరుల సహాయంతో భార్య శైలజ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో తన భర్త రాజేష్‌పై దాడి చేసి హత్య చేసిన మక్కాజీ ప్రవీణ్, మక్కాజీ సరిత, మక్కాజీ ప్రమీల, బొక్క రాజులపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు నిందితులపై కేసు నమోదు చేసి హత్యా కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువు అయినందున నిందితులకు జీవిత ఖైదు, రూ.5వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ గోవింద్ రవికుమార్ సాక్షులను ప్రవేశపెట్టగా, లైజన్ అధికారిగా కె.హరికృష్ణ, దర్యాప్తు అధికారులుగా సీఐలు సతీష్‌బాబు, ఎం.సాయిరమణ వ్యవహరించారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సిరబోయిన శ్రీనివాస్ కేసు వాదించారు.


మానుకోటలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో వినాయకుడి పూజల్లో పాల్గొన్న నేతలు


ఆర్టీసీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో గణనాథుడుకి పూజలు చేస్తున్న వెల్ఫేర్ సొసైటీ, యూత్ సభ్యులు


మానుకోటలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు


మానుకోటలో వెండితో తయారు చేయించిన గణనాథుడి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న దృశ్యం

కొలువుదీరిన గణనాథులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : జై.. జై.. గణేశా.. జైబోలో గణేశా.. అంటూ బుధవారం భక్తులు వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. వర్షంలో సైతం వివిధ ఆలయ కమిటీల నిర్వాహకులు, యుజవన సంఘాల బాధ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి గణపతి మండపాల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించారు. పోలీస్ యంత్రాంగం ముందస్తుగానే గణేష్ మండళ్ల ఏర్పాటుకు సంబంధించి ప్రత్యేక సూచనలు చేసి ఉండడంతో ఉత్సవ కమిటీల నిర్వాహకులు విగ్రహాల ఏర్పాటుపై సమగ్ర సమాచారాన్ని అధికారులకు అందజేశారు. జిల్లా వ్యాప్తంగా చిన్న, పెద్ద కలిపి మొత్తం 814 విగ్రహాలతో గణనాథులు కొలువుదీరాడు. కొందరు మూడ్రోజులకు, మరికొందరు ఐదురోజులకు, జిల్లా కేంద్రంలో మాత్రం నవరాత్రి ఉత్సవాలను ఘనంగా జరుపుకుని నిమజ్జనం చేయడం అనవాయితీగా వస్తోంది. ఈ సంవత్సరం జిల్లా వ్యాప్తంగా గణేష్ నవరాత్రులను ప్రశాంతంగా జరుపుకునేందుకు నిర్వాహకుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగకుండా విద్యుత్ అలంకరణల సందర్భంగా షార్ట్ సర్క్యూట్‌తో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టారు. అంతేకాకుండా మండపాలు నిర్వహకుల ఫోన్ నెంబర్లు కూడా ఫ్లెక్సీలలో ఏర్పాటు చేయించారు. ప్రతీ గణేష్ మండపం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసుల అవగాహన కల్పించారు. మహబూబాబాద్ పట్టణ కేంద్రంతో పాటు ఆయా కాలనీల్లో వీదివీధిన ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో శ్రీమహాలక్ష్మీ గణపతి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గోమయం వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఎస్వీ నాగేశ్వర్‌రావు, రామారావు, సోమ శ్రీనివాస్, రాధాకృష్ణ, కృష్ణ, రాంబాబు పాల్గొన్నారు.
- మహబూబాబాద్ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో శ్రీలక్ష్మీ గణపతి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గత ఏడాది 18 కిలోల వెండితో తయారుచేయించిన వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. ట్రస్టు కమిటీ బాధ్యులు సోమ రత్నశేఖర్, వేలం విద్యాసాగర్, జంగాల కిరణ్ కుమార్, శ్రీనివాస్, వేములపల్లి శ్రీనాథ్, జంగాల విజయ్‌కుమార్, రామారావు, రమేష్ పాల్గొన్నారు.
- ఆర్టీసీ కాలనీ వెల్ఫేర్ సొసైటీ, యూత్ సభ్యులు కమ్యూనిటీ హాల్‌లో వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ బాధ్యులు పట్టాభి లక్ష్మయ్య, చంద్యానాయక్, యాదగిరి, కృష్ణారెడ్డి, శ్రీనివాసరావు, ప్రభాకర్‌రెడ్డి, బాలాజీ, సోమయ్య, సుందర్, యూత్ సభ్యులు వరుణ్, నవీన్, సాగర్, ప్రవీణ్, మనోజ్, తరుణ్, శ్రీను, వికాస్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.
- మహబూబాబాద్ మునిసిపాలిటీ పరిధిలోని అనంతారంలో బూర్ల వెంకన్న, బూర్ల అశోక్, బత్తుల శ్రీనివాస్, బూర్ల వెంకటేష్, అరెల్లి నరేష్‌ల ఆధ్వర్యంలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- బీజేపీ జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు వల్లభు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వద్దిరాజు రాంచందర్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చీకటి మహేష్ గౌడ్, పల్లె సందీప్, వెన్నమల్ల సందీప్, నరేష్, శ్యాంలు కుటుంబసభ్యులతో హాజరై పూజల్లో పాల్గొన్నారు.

వివిధ మండలాల్లో ..

- మరిపెడ మండలంలోని అన్ని గ్రామాల్లో వినాయక చవితిని పురస్కరించుకొని గణనాథులకు ఘనంగా పూజలు నిర్వహించారు.
- మరిపెడ మునిసిపల్ కేంద్రంలో వినాయక చవితి వేడుకలను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ఆర్ఎస్ ప్లాజాఉత్సవ కమిటీ భారీ ఊరేగింపు నడుమ గణనాథుడిని ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో కోలాట బృందాలు, ఉత్సవ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.
- గార్ల మండల కేంద్రంలోని పలుకాలనీల్లో వినాయక ఉత్సవాల్లో భాగంగా గణనాథుడికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పట్టణంలోని టీపీసీసీ సభ్యుడు ఎడ్ల శ్రీరాంయాదవ్ నివాసగృహంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద భక్తులుఅ త్యధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వర్తకసంఘ భవనంలో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఎడ్ల శ్రీరాంయాదవ్, రమేష్, విశాల్‌జైన్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.
- బయ్యారంలో గణపతి నవరాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో గణనాథులను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- కురవి మండల కేంద్రంలోని శ్రీవీరభద్రస్వామి దేవాలయంలో ఏర్పాటు చేసి వినాయక విగ్రహం వద్ద ఈవో సత్యనారాయణ, చైర్మన్ కొర్ని రవీందర్‌రెడ్డి, ధర్మకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కురవి, సీరోలు మండలాల వ్యాప్తంగా అన్ని గ్రామాలు తండాల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు.
- గంగారం మండలం కోమట్లగూడెం కోదండరామాలయంలో గణపతి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సురేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.
- నెల్లికుదురు మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాల్లో నిర్వాహకులు, భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.
- కొత్తగూడ మండలంలో వినాయక చవితి పర్వదినాన్ని మండల ప్రజలు, యువకులు, చిన్నారులు ఘనంగా నిర్వహించుకున్నారు. గణపతి విగ్రహాల ఏర్పాటు కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో గణనాథుల విగ్రహాలను ప్రతిష్ఠించారు.
- ఇనుగుర్తి మండలం అయ్యగారిపల్లి గ్రామం బొడ్రాయి వీధి వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద మహాఅన్నదాన కార్యక్రమంను మలిశెట్టి బింధు-శోభన్, మద్దికుంట్ల కావ్యసునిల్, బొల్లు రుచిత, సంపత్ దంపతులు చేపట్టారు. గ్రామస్థులు పాల్గొన్నారు.
- డోర్నకల్ మునిసిపల్ కేంద్రంతో పాటు అన్ని గ్రామాలు, తండాల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- కేసముద్రం ఆర్యవైశ్య భవన్‌లో శ్రీవరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ, రైల్వేస్టేషన్ ఆవరణలో ఆదిదేవా వెల్ఫేర్ అసోసియేషన్, అమినాపురం, ఉప్పరపల్లి తదితర గ్రామాల్లో పలు వీధుల్లో వినాయకున్ని ఏర్పాటు చేశారు.

యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శిగా పవన్‌కల్యాణ్



కేసముద్రం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : యువజన కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా కేసముద్రం మునిసిపాలిటీ సబ్‌స్టేషన్‌తండాకు చెందిన బాదావత్ పవన్‌కళ్యాణ్‌ను నియమించినట్లు యూత్ జిల్లా అధ్యక్షుడు అజ్మీరా సురేష్‌నాయక్ ప్రకటించారు. ఈ మేరకు మహబూబాబాద్‌లో గురువారం ఆయనకు నియామక పత్రాన్ని ఎమ్మెల్యే మురళీనాయక్, డీసీసీ అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, నరేటి కొమురయ్య ఉన్నారు.

కేసముద్రం లారీ ఓనర్స్ అసోసియేషన్ ఎన్నిక


అల్లి అశోక్ అధ్యక్షుడు

కేసముద్రం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం లారీ ఓనర్స్ అసోసియేషన్ నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. ఈ కమిటీ అధ్యక్షుడిగా అల్లి అశోక్, ఉపాధ్యక్షునిగా ధరావత్ భీమానాయక్, కార్యదర్శిగా గుగులోత్ వీరన్ననాయక్, కోశాధికారిగా జలగం వెంకటేశ్వర్‌రావు, సహాయ కార్యదర్శిగా చిర్రబోయిన యాకన్నను ఎన్నుకున్నారు.

జిల్లాలో మోస్తరు వర్షం

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం 8.30 గంటల వరకు జిల్లాలోని పలు మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. బుధవారం పొద్దంతా ముసురు ఆలుముకుంది. చిన్నగూడూరు, డోర్నకల్, కురవి, మరిపెడ, గార్ల, నెల్లికుదురు, బయ్యారం, నర్సింహులపేట, కొత్తగూడ, గూడూరు, గంగారం, కేసముద్రం మండలాల్లో ఓ మోస్తారు వర్షం కురిసింది. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం కురియలేదు.

● జిల్లాలో 506.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సగటున 31.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. చిన్నగూడూరులో 52.4, డోర్నకల్‌లో 50.2, మరిపెడలో 46.8, కొత్తగూడలో 30.2, గంగారంలో 23.4, బయ్యారంలో 31.4, గార్లలో 37.8, కురవిలో 48.4, మహబూబాబాద్‌లో 31.6, గూడూరులో 24.0, కేసముద్రంలో 21.6, నెల్లికుదురులో 36.8, నర్సింహులపేటలో 31.6, దంతాలపల్లిలో 9.2, తొర్రూరులో 16.6, పెద్దవంగరలో 14.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

అతిగా మద్యం సేవించి యువకుడు మృతి

మరిపెడ రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : అతిగా మద్యం సేవించిన ఓ యువకుడు మృతి చెందిన ఘటన స్టేజీ తండా (జీపీ) సమీపంలో గురువారం తెల్లవారు జామున జరిగింది. ఎస్సై బొలగాని సతీష్‌గౌడ్, తండా వాసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆనేపురం శివారు మేఘ్యా తండాకు చెందిన భూక్య వెంకన్న(25) ఆటో నడుపుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. స్టేజీ తండా జీపీ పరిధిలోని ఓ వెంచర్ వద్ద ఆటో నిల్చి ఉంది. గురువారం తెల్లవారు జామున తండా వాసులు గమనించి ఆటోలో ఉన్న వెంకన్నను నిద్రలేపగా, వెంకన్న ఉలుకుపలుకు లేకుండా ఉండడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకుని చూసేసరికి మృతి చెంది ఉన్నాడు. వెంకన్నకు పదేళ్ల కిందట వివాహం జరిగింది. భార్యాభర్తలు మధ్య కొంత కాలంగా మనస్పర్థలు ఏర్పడడంతో భార్య పుట్టింటికి వెళ్లింది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

దాడి ఘటనల్లో ఇద్దరిపై కేసు నమోదు

మహబూబాబాద్ క్రైం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు కేసుల్లో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ మహేందర్‌రెడ్డి గురువారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. ఓ మహిళ తన భర్త చికిత్స కోసం మానుకోటలోని జిల్లా ప్రధాన ఆస్పత్రికి రాగా, ఆమె పట్ల పట్టణంలోని నందిని నగర్ కాలనీకి చెందిన ఉప్పరి నవీన్ అనే యువకుడు అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

● మరో దాడి కేసులో మహబూబాబాద్ పట్టణంలోని ఓ యువతి పట్ల గతంలో ఉన్న పరిచయాన్ని ఆసరా చేసుకొని ఆమె ఇంటికెళ్లి తనవెంట రావాలని గుండ్లకుంట కాలనీకి చెందిన పుచ్చకాయల విశాల్ ఇబ్బంది పెట్టాడు. ఈ క్రమంలో అడ్డువచ్చిన ఆ యువతి అన్నపై దాడి చేశాడు. దీంతో బాధిత యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విశాల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

నిబద్ధతతో పనిచేసి గుర్తింపు పొందాలి

మహబూబాబాద్‌క్రైం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : పదోన్నతి పొందిన పోలీసులు విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేసి గుర్తింపు పొందాలని ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ అన్నారు. ఖమ్మం కమిషనరేట్‌కు చెందిన 20 మంది, వరంగల్ కమిషనరేట్ నుంచి ఒకరు 1998 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుళ్లు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొంది మహబూబాబాద్ జిల్లాకు బదిలీపై వచ్చారు. అనంతరం సుధీర్‌రాంనాథ్ కేకన్‌ను గురువారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదోన్నది పొందిన సిబ్బంది విధి నిర్వహణలో సమర్థతతో సేవలు అందించాలన్నారు. ప్రజా సమస్యలపై స్పందన, నైతిక విలువలు, క్రమశిక్షణ లాంటి అంశాలలో ఆదర్శంగా నిలవాలన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యం

మహబూబాబాద్‌క్రైం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్-గుండ్రాతిమడుగు రైల్వేస్టేషన్ల మధ్య ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు రైల్వే ఎస్సై జె.సురేష్ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. గుండ్రాతిమడుగు రైల్వేస్టేషన్ సమీపంలో కిలోమీటర్ నెంబర్ 440 బై24 వద్ద ఓగుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడని సమాచారం అందడంతో, ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించగా అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు రైలు నుంచి జారిపడి మృతి చెంది ఉంటాడని ప్రాథమికంగా నిర్ధారించినట్లు తెలిపారు. మృతుడు తెల్లటి ఫుల్‌షర్ట్, బ్లాక్ కలర్ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని జిల్లా ప్రధాన ఆస్పత్రిలోని మార్చురి గదిలో భద్రపరిచినట్లు తెలిపారు. సమాచారం తెలిస్తే 8712658602 నెంబర్‌కు తెలియజేయాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలి

గూడూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : బ్రాహ్మణపల్లికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు బుడిగె సతీష్‌గౌడ్ విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌ను గురువారం శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బుడిగే సతీష్‌గౌడ్ మాట్లాడుతూ.. బ్రాహ్మణపల్లి గ్రామంలో కొంతమందికి ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయని, ఇంకా ఇళ్లు లేని నిరుపేదలు చాలా మంది ఉన్నారని, వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి ఆదుకోవాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు సతీష్‌గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు భూపతి శ్రీనివాస్, పూనెం యాకయ్య, బత్తుల రామన్న, జున్నూరి వెంకన్న, యాకాచారి పాల్గొన్నారు.

కుక్క అడ్డువచ్చి రైతుకు గాయాలు

తొర్రూరు రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనంపై వెళ్తున్న రైతుకు కుక్కలు అడ్డువచ్చి తగలడంతో అదుపుతప్పి రైతు తీవ్రంగా గాయపడిన సంఘటన తొర్రూరు మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం. తొర్రూరు మండలం చెర్లపాలెం గ్రామానికి చెందిన రైతు బీరెల్లి హరీశ్‌రెడ్డి యూరియా బస్తాల కోసం అన్నారం రోడ్డులో ఉన్న పీఏసీఎస్ కేంద్రం వద్ద ఆధార్ కార్డు, భూమి పాసుపుస్తకం లైన్‌లో పెట్టి బైక్‌పై వస్తున్నాడు. ఈ క్రమంలో వందేమాతరం ఫౌండేషన్ సమీపంలో కుక్కలు ఒక్కసారిగా వచ్చి బైక్‌ను తగలడంతో కిందపడగా తలకు గాయమైంది. గమనించిన స్థానికులు స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

అప్రమత్తంగా ఉండండి : కలెక్టర్

● బయ్యారంలో ఆకస్మిక పర్యటన

బయ్యారం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా అందుబాటులో ఉండాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలో ఆకస్మిక పర్యటన చేసిన కలెక్టర్ బయ్యారం పెద్ద చెరువు అలుగు ప్రదేశాన్ని సందర్శించారు. ప్రజలు చేపల వేటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలుగు వరద ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. వరదలతో ఎలాంటి ముప్పు వాటిల్లకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. అంతకుముందు బయ్యారం పీహెచ్‌సీని సందర్శించిన కలెక్టర్ ఇన్‌వార్డు పేషంట్ల ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలన్నారు. సరిపడ మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరి హెల్త్ ప్రొఫైల్ పరిశీలించాలన్నారు. హెల్త్ సబ్ సెంటర్లలో షెడ్యూల్ ప్రకారం వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించడంతో పాటు మాత, శిశు మరణాలు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు.

ఈ క్రమంలోనే బయ్యారం బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థుల్లోని విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. పిల్లల్లోని జ్ఞానాన్ని వెలికి తీసేలా ఉపాధ్యాయులు నూతన పరిజ్ఞానం వినియోగించాలని సూచించారు. విద్యార్థుల మానసిక, ఆరోగ్య, విద్య అంశాలను ఎప్పటికప్పుడు గమనించాలన్నారు. విద్యాదర్థులకు మెనూ ప్రకారం పౌష్టికమైన మధ్యాహ్న భోజనం అందించడంతో పాటు పాఠశాల వాతావరణాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. చివరగా ఇల్లెందు-మహబూబాబాద్ ప్రధాన రహదారి మార్గమంలోని బయ్యారం మండలం నామాలపాడు సమీప జిన్నెల వాగు లోలెవల్ బ్రిడ్జీని సందర్శించిన కలెక్టర్ వరదల సమయంలో ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో విజయలక్ష్మీ, వైద్యాధికారి విజయ్‌తో పాటు సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


రోడ్డుపై రైతులతో బైఠాయించి ధర్నా చేస్తున్న బానోతు శంకర్‌నాయక్

రైతు సంక్షేమాన్ని విస్మరిస్తున్న కాంగ్రెస్

● మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్ అన్నారు. యూరియా కొరతను నిరశిస్తూ జిల్లా కేంద్రంలోని కంకరబోడుసమీపంలోని తొర్రూరు - మహబూబాబాద్ ప్రధాన రహదారిపై గురువారం రైతులతో కలిసి రోడ్డుపై బైఠాయించి ధర్నా రాస్తారోకో నిర్వహించారు. గంటపాటు ఆందోళన చేయడంతో వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ మాట్లాడుతూ.. గత పక్షం రోజుల నుంచి యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం స్పందించడంలేదని ఆరోపించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా మహిళా రైతులు గొడుగులు ధరించి క్యూలైన్‌లో నిలబడడం దారుణమన్నారు. గడిచిన పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్క రైతు రోడ్డు ఎక్కిన దాఖలాలు లేవని గుర్తు చేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం పాలనా తీరు తెలుస్తుందన్నారు. విషయం తెలుసుకున్న మహబూబాబాద్ టౌన్ సీఐ మహేందర్‌రెడ్డి, ఏవో తిరుపతిరెడ్డి ఘటనా స్థలం వద్దకు చేరుకొని రైతులకు సరిపడ యూరియా సరఫరా చేయిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ నిరసనలో బీఆర్ఎస్ నాయకులు లూనావత్ అశోక్‌నాయక్, జేరిపోతుల వెంకన్న, సాయి, షరీఫ్, రాంచంద్రు, బాలలునాయక్, బాబా, రైతులు పాల్గొన్నారు.

'విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు చర్యలు'

మహబూబాబాద్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు విద్యాశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం విద్యాశాఖ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా విద్యాశాఖ పరిధిలో జడ్పీహెచ్ఎస్, యూపీహెచ్ఎస్, కేజీబీవీలు మొత్తంగా 898 పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్నారని వారిలో అభ్యసన సామర్థ్యాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. విద్యార్థుల లెర్నింగ్ అభ్యసన సామర్థ్యాలపై దృష్టి పెట్టాలని తెలిపారు. విద్యార్థనులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని, ఉత్సాహవంతులైన వారిని క్రీడల్లో ప్రోత్సాహించాలన్నారు.

జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో మాట్లాడుతూ. పీఎంశ్రీ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పించిన నూతన డిజిటల్ తరగతులను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి, అప్పారావు, చంద్రశేఖర్‌ఆజాద్, సంతోష్, విజయకుమారి, శ్రీరాములు, సతీష్, లచ్చిరాం, బాలాజీ, నర్సింహారావు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల ఆందోళన

తొర్రూరు రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : యూరియా అందించాలని డిమాండ్ చూస్తూ తొర్రూరులో ఖమ్మం-వరంగల్ జాతీయ రహదారి పై రైతులు సుమారు గంట పాటు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాలోతు యాక్, భద్రు, వెంకటేశ్వర్లు, వెంకన్న, మణెమ్మ, మల్లమ్మ తదితరులు మాట్లాడుతూ ఉదయం నుంచి యూరియా కోసం పీఏసీఎస్, రైతు వేదికల వద్దకు తిరుగుతున్న కనీసం ఒక్క యూరియా బస్తా కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం రైతులకు సరిపడా యూరియా సరఫరా చేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. టోకెన్ల కోసం గంట, యూరియా బస్తా కోసం గంటల కొంది లైన్లలోనే నిలుస్తున్నప్పటికీ యూరియా దొరకడం లేదన్నారు. వరికి యూరియా వేయాలంటే పనులు వదిలేసుకొని ఉదయం 5గంటల నుంచి పడిగాపులుగాస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. రైతుల ఆందోళనతో భారీ ఎత్తుల వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఎస్సై జి.ఉపేందర్ వచ్చి ఆందోళన చేస్తున్న రైతులకు సర్దిచెప్పుతుండగా రైతువేదిక వద్దకు ఎస్సై వస్తేనే వెళ్తామని రైతులు భీష్మించడంతో ఎస్సై రైతులతో పాటు వెళ్లి అధికారులతో మాట్లాడడంతో ఆందోళన సద్దుమణిగింది.

'సంక్షేమ రాజ్యంలో అర్హులకే ఫలాలు'

డోర్నకల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పేదలకు అన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయని ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచందర్‌నాయక్ అన్నారు. డోర్నకల్ మండల ప్రజాపరిషత్‌లో గురువారం సీఎంఆర్ఎఫ్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా రాంచందర్‌నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో దళారుల ప్రమేయం లేకుండా ఇందిరమ్మ ఇండ్లు నిర్మిస్తున్నామన్నారు. నిజమైన లబ్ధిదారులను గుర్తించి వారికి సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు గుర్తు చేశారు. అనంతరం అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. డోర్నకల్ మండలం నుంచి విద్యుత్‌శాఖపైనే ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని ఏఈ కిరణ్‌ను ఎమ్మెల్యే జాటోత్ రాంచందర్‌నాయక్ మందలించారు. పని తీరు మార్చుకుని ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. డోర్నకల్ తహసీల్దార్ ఇమ్మాన్యుయేల్, ఎంపీడీవో శ్రీనివాసరావు, మునిసిపల్ కమిషనర్ నిరంజన్, ఏవో మురళీమోహన్, పబ్లిక్ హెల్త్ ఏఈ శృతి, కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు సుమీర్‌చంద్‌జైన్, నాయకులు బత్తుల శ్రీనివాస్, తాళ్లూరి హనుమ, మాద శ్రీనివాస్, ఖాదర్‌బాబా, శీలం శ్రీనివాస్, దాసరి నాని, వల్లభనేని రవికుమార్, కొత్త యాకేష్ పాల్గొన్నారు.

మానుకోట అభివృద్ధే లక్ష్యం : మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మానుకోట నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని, అందుకోసం అహర్నిశలు కృషి చేస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ పరిధిలోని అనంతారం, మల్యాల, శనిగపురం గ్రామాల్లో ప్రభుత్వ స్థలాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక యువత వలస బాట పట్టారని చెప్పారు. మానుకోట నియోజకవర్గ కేంద్రంలోనే రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం 200 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించామని తెలిపారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్రానికి నివేదిక అందించనున్నట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనలో వందలాది ఎకరాల భూమి కబ్జాకు గురైందని విమర్శించారు. మల్యాలలోనే హార్టికల్చర్ యూనివర్శిటీని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్ధార్ రాజేశ్వర్, ఖలీల్ పాషా, ఎడ్ల రమేష్, బండారు వెంకన్న, వెంకన్న, చిన్నానాయక్, మహబూబ్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

● మహబూబాబాద్ ఆర్టీసీ కాలనీని స్థానిక ఎమ్మెల్యే మురళీనాయక్ సందర్శించారు. అంతర్గత రోడ్లు, సైడ్ కాల్వలకు మరమ్మత్తులు చేయిస్తానని స్పష్టం చేశారు. అనంతరం ఇటీవల మృతి చెందిన విద్యుత్ లైన్ మెన్ పడాల శ్రీనివాసరావు కుటుంబాన్ని పరామర్శించారు.

టెక్నాలజీ కోర్సుల్లో ప్రవేశాలు పూర్తి చేయాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్ :ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో కొత్తగా ప్రవేశ పెట్టిన అడ్వాన్స్ టెక్నాలజీ కోర్సు (ఏటీసీ)ల్లో ప్రవేశాలు పూర్తి చేయాలని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మహబూబాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం ఏటీసీ కోర్సుల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో 2025-26 విద్యాసంవత్సరంలో నూతన కోర్సులు మ్యాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, ఇండస్ట్రీయల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుఫాక్చరింగ్ టెక్నీషియన్, ఆర్టిసన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్, బేసిక్‌డిజైనర్, వర్చువల్ వెరిఫైడ్ (మెకానికల్), మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ (ఈవీ) కోర్సుల్లో ప్రవేశాలు పొంది కోర్సు పూర్తి చేస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయనే విషయాన్ని విద్యార్థులకు తెలియజేయాలని సూచించారు. అర్హులైన, ఆసక్తిగల విద్యార్థులు ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకునేలా సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏటీసీ వరంగల్ రీజియన్ డిప్యూటీ డైరెక్టర్ బి. సీతారాములు, ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ బాబు, సూపరిండెంట్ రాజేశ్వర్ పాల్గొన్నారు.